సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : సమగ్ర కుటుంబ సర్వే చేసేందుకు సర్కిళ్ల వారీగా ఎన్యుమరేటర్‌లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. వచ్చే నెల 6 నుంచి జరిగే సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయించింది. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం సర్కిళ్ల వారీగా ఎన్యుమరేటర్లకు సర్వే ప్రొఫార్మాను ఎలాంటి మార్గదర్శకాలతో పూరించాలో మాస్టర్ ట్రైనర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పర్యవేక్షణ చేసి శిక్షణను సమర్థవంతంగా నిర్వహించారు. కుటుంబాల సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమాచారాన్ని సక్రమంగా సేకరించడానికి వీరు మార్గనిర్దేశం చేశారు.

దీపావళి శుభాకాంక్షలు : మేయర్

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : దీపావళిని పురస్కరించుకుని బుధవారం జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆర్థిక విభాగం ట్రెజరీలో నిర్వహించిన ప్రత్యేక పూజలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులకు, కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు సురక్షితంగా, పర్యావరణహితంగా దీపావళి పండుగ జరుపుకోవాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీత రాధిక, నళిని పద్మావతి, యాదగిరి రావు, పంకజ, సత్యనారాయణ, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, ఏసీపీ సుదర్శన్ పాల్గొన్నారు.

ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో ఘనంగా ఏక్తా దివస్

- పాల్గొన్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (ఈ నెల 31న) సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో బుధవారం 'ఏక్తా దివాస్ జరుపుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏక్తా దివస్ దీపావళితో కలిసి నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ రైల్వే ఉద్యోగులు, సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్ అదనపు జీఎం నీరజ్ అగర్వాల్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరుతో పాటు నాందేడ్ డివిజన్లలో కూడా ఏక్తా దివస్‌ను జరుపుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కాలుష్యానికి దూరంగా.. పర్యావరణ హితంగా!

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : లోక కంటకులైన అసురుల సంహారం నేపథ్యంలో అన్ని లోకాలు ఆనందంగా చేసుకునే పండుగే దీపావళి. ఈ వేడుకను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ప్రమాదకర రసాయనాలతో రూపొందించిన బాణాసంచా నుంచి వెలువడిన పొగ, ధూళి వాతావరణాన్ని మరింత కలుషితం చేస్తాయని సూచించారు. భారీ శబ్దాలు రావాలనే ఉద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా తయారు చేయడం వల్ల ధ్వని కాలుష్యం అధికంగా నమోదవుతుందని హెచ్చరించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. సాధారణ రోజుల్లో 30-37 శాతం కాలుష్యం నమోదైతే.. దీపావళి రోజున పెరుగుతున్న స్థాయి 60-70 వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నైట్రేట్, యాంటీమోనీ, మెర్క్యూరీ ఆర్సెనిక్, లిథియం, లెడ్, మెగ్నీషియం, జింక్, సోడియం వంటివి విచ్చలవిడిగా ఉపయోగించడం వల్ల చర్మ వ్యాధులు, నేత్ర, మానసిక సమస్యలు తలెత్తుతాయని వైద్యులు నవజన్ హెచ్చరించారు. కాగా, పటాకులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు, కళ్లజోడు ధరించాలని సూచించారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

ప్రజలకు తప్పిన విద్యుత్ చార్జీల పెంపు

పటాకులు కాల్చుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువ నాయకుడు ముఠా జయసింహ, పార్టీ శ్రేణులు

చిక్కడపల్లి, అక్టోబర్ 30: బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రజలకు విద్యుత్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. విద్యుత్ చార్జీలను పెంపు ఉపసంహరించుకోవడంతో బుధవారం గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో సంబురాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, పార్టీ యువ నాయకుడు ముఠా జయసింహ, పార్టీలో శ్రేణులతో కలిసి పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తోందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా పేదలపై భారం పడుతుందని భావించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎల్బక్షి సిటీ రెగ్యులేటరీ కమిటీ బోర్డుకు విన్నవించిందని తెలిపారు. దీంతో విద్యుత్ పెంపు ఉపసహరించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ల అధ్యక్షులు రాకేశ్‌కుమార్, శ్రీధర్ రెడ్డి, శ్యామ్‌యాదవ్, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్, శ్రీనివాస్ గుప్తా, సత్యనారాయణ, రవి, రవిశంకర్ గుప్తా, శ్రీకాంత్, అరుణ్‌కుమార్, సాయికృష్ణ కె.అరుణ్, జహంగీర్, శ్రీధర్‌చారి, ఎయిర్‌టెల్ రాజు, వంశీ పాల్గొన్నారు.



18,500 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై పడకుండా ఆపడంలో విజయం సాధించినందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నగర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేశారు. మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి తదితరులు. – మల్లాపూర్, అక్టోబర్ 30

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటాలకు యూసుఫ్‌గూడ అంబేద్కర్ కూడలిలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య విజయ్ ఆధ్వర్యంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సంతోష్ ముదిరాజ్, నర్సింగ్ దాస్, వార్డు కమిటీ సభ్యులు, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. –జూబ్లీహిల్స్

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్ మూడో వార్డులోని అన్నానగర్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాస్, సంతోష్, కుమార్ ముదిరాజ్, ధన్‌రాజ్, నర్సింహ, శ్యామ్‌రెడ్డి, అబ్దుల్, వాహబ్, అజ్జాభాయ్, శ్రీను, ధనుంజయ్, ప్రకాశ్, చిన్నా, రాకేశ్, శేఖర్, బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

– కంటోన్మెంట్, అక్టోబర్ 30

పైసా లేకుంటే ఫైల్ కదలదు!

- పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో ఎస్బీ సిబ్బంది చేతివాటం!
- అటకెక్కిన ఫీడ్ బ్యాక్ సిస్టమ్
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి

సిటీబ్యూరో, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) పోలీసులు చేతి వాటం రోజు రోజుకు పెరుగుతున్నది. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వెళ్లే వారిలో కొందరు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్టిఫికెట్లు తీసుకున్న తరువాత కొందరు తలగోకుతూ సైగలు చేస్తుండగా.. మరికొందరు సారూ ఏం లేదా? అంటూ అడుగుతున్నారు. ఇలా ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఈ తంతూ సాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో ఉండే అవినీతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కూకటివేళ్లతో అణిచివేసింది. పారదర్శకంగా పోలీస్ వెరిఫికేషన్ ఉండే విధంగా నిబంధనలు కఠినం చేసి, సామాన్యుడికి చింత లేకుండా చేసింది. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో ఫీడ్ బ్యాక్ విధానాన్ని తీసుకొచ్చి సిబ్బందిలో జవాబుదారీతనం పెంచింది. సిబ్బందికి కూడా వాహనం ఇవ్వడంతో పాటు నెలకు 30 లీటర్ల పెట్రోల్ ఇస్తూ పారదర్శక సేవలు అందించాలంటూ అధికారులు ఎప్పటికప్పుడు చెబుతూ ఉండేవాళ్లు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ అయిన తరువాత... దరఖాస్తుదారులకు ఫోన్ చేసి సిబ్బంది ఎలా ప్రవర్తించారంటూ థర్డ్‌పార్టీ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే వాళ్లు. నేడు ఆ ఫీడ్ బ్యాక్ విధానాన్ని అటకెక్కించారు.

పట్టించుకోని ప్రభుత్వం...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తయ్యింది. అయినా కూడా పాస్‌పోర్టు వెరిఫికేషన్ ఎలా జరుగుతుందనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఆరా తీయలేదు. పత్రికలు, మీడియాలో వార్తలు వచ్చినప్పుడు రివ్యూలు పెట్టుకోవడం, ఆ తరువాత విషయాన్ని అక్కడే వదిలేసే విధంగా నేడు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కరువవ్వడంతో అవినీతిలో కొంతమంది సిబ్బందికి స్వేచ్ఛ వచ్చింది. పాస్‌పోర్టు వెరిఫికేషన్ కోసం వెళ్లారంటే అక్కడ ముక్కుపిండి రూ. 1000 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేయడమే లక్ష్యంగా వసూళ్ల పర్వానికి తెరలేపారు. కొందరు డబ్బులు ఇవ్వకపోతే ఏవో కొర్రీలు పెట్టి కాలయాపన చేస్తూ దరఖాస్తుదారులను టెన్షన్‌కు గురిచేస్తున్నారు.

ఇవ్వకపోతే రాదేమో..!

క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది ప్రజలకు వేగంగా పారదర్శకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో ఫీడ్ బ్యాక్ విధానాన్ని తీసుకొచ్చారు. పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోగానే అదే రోజు లేదంటే మరుసటి రోజు పాస్‌పోర్టు కార్యాలయం నుంచి ఆయా కమిషనరేట్ల ఎస్బీ విభాగానికి ఆయా దరఖాస్తు ఫారాలు వస్తాయి. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్ల వారీగా ఆ దరఖాస్తు ఫారాలు పంపించేస్తారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఉండే ఎస్బీ సిబ్బంది దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేవా? అనే విషయాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఉన్నతాధికారుల పరిశీలన తరువాత పాస్‌పోర్టు కార్యాలయానికి తిరిగి వెళ్తుంది. ఈ ప్రాసెస్‌కు ఒకటి నుంచి మూడు రోజుల సమయం తీసుకుంటారు. అయితే పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వచ్చిన వారికి చేతిలో కొంత డబ్బు పెడితే వెంటనే ఆ ఫారం పంపించేస్తారు. లేదంటే మేం ఇంకా విచారణ చేయాల్సి ఉందంటూ కాలయాపన చేస్తూ పాస్‌పోర్టు దరఖాస్తుదారులను ఆందోళన కల్గిస్తుంటారు. ప్రతి జోన్‌లో 70 శాతం మంది ఎస్బీ కానిస్టేబుల్స్ పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో దరఖాస్తుదారుల నుంచి లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఎంతో కొంత ఇచ్చుకుంటే పనైతదంటూ కొందరు దరఖాస్తుదారుల వ్యవహారం కూడా ఉండటంతో అది వెరిఫికేషన్ చేసే సిబ్బందికి కలిసి వస్తుంది.

కొన్ని ఘటనలు..!

- మల్కాజిగిరి జోన్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ అక్కడే పదోన్నతులు పొంది ఎస్బీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నాడు. ఆయన పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వెళ్లాడంటే అక్కడ రూ. 2 వేలు పడాల్సిందే. అలా ఇస్తేనే పాస్‌పోర్టు వెరిఫికేషన్ సక్రమంగా వెళ్తుంది లేదంటే దరఖాస్తుదారుడికి చుక్కలు చూపిస్తాడు. అదే జోన్‌లో మరో ఠాణా పరిధిలో ఎస్బీ సిబ్బంది వెరిఫికేషన్‌కు వెళ్తే ఉట్టిచేతులతో వెనక్కి వచ్చే అవకాశమే ఉండదు.
- ఎల్బీనగర్ జోన్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి గేటు బయటికి పిలుస్తాడు.. అక్కడే అన్ని వెరిఫికేషన్ పూర్తి చేసుకొని అక్కడి నుంచి వెళ్తాడు. ఒక వేళ దరఖాస్తుదారుడు ఆయన ఇంటికి వెళ్లిన సమయంలో లేడంటే ఇక నీకు పాస్‌పోర్టు రాదంటూ భయపెట్టిస్తాడు. నీవు ఇక్కడ ఉండటం లేదని రిపోర్టు రాసేస్తానంటూ బెదిరిస్తాడు. ఇతని బెదిరింపులకు భయపడిన ఓ దరఖాస్తుదారుడు ఢిల్లీలో ఉంటే ఆఘమేఘాలపై ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు చేరుకొని మరుసటి రోజు వెరిఫికేషన్‌కు హాజరయ్యాడు. మరొక కానిస్టేబుల్ దరఖాస్తుదారుడి వెరిఫికేషన్ పూర్తి కాగానే సార్.. అంటూ ప్రశ్నార్థకమైన ముఖం పెడుతాడు, దీంతో దరఖాస్తుదారుడు ఎంతో కొంత ఇవ్వాల్సిందే.
- ఈస్ట్‌జోన్‌లో ఓ ఎస్బీ కానిస్టేబుల్ పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వెళ్తే రూ. 1500 లేకుండా రాడు. దరఖాస్తుదారుడు తనకు పోలీస్ శాఖలో ఫలానా వాళ్లు తెలుసు అని చెబితే.. వాళ్లు ఏమైనా సుద్దపూసలా..! నాకిచ్చేది నాకు ఇవ్వండి సార్ అంటూ మాట్లాడుతాడని సమాచారం.
- వెస్ట్‌జోన్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ డబ్బులు లేనిదే పాస్‌పోర్టు వెరిఫికేషన్ చేసేది లేదంటూ చెబుతుండటంతో రెండు నెలల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆమెపై చర్యలు తీసుకున్నారు.

దీపావళి సందడి..

గురువారం దీపావళి పండుగ కావడంతో బుధవారం నగరంలో వ్యాపార సముదాయాలు, వస్త్ర దుకాణాలు, పూల దుకాణాలు, పూజా సామగ్రి షాపులు, పటాకుల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి. పండుగ సందర్భంగా భక్తిశ్రద్ధలతో పలు పూజలు చేసే వారు పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. వివిధ ఆకారాల్లో ఉన్న బొమ్మలు, దీపంతలు తదితర వాటిని ఆసక్తిగా కొనుక్కున్నారు.

చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి

- సెలవులని స్నేహితుడి ఇంటికి రాగా ప్రమాదం

మోటకొండూర్, అక్టోబర్ 30 : దీపావళి సెలవులని స్నేహితుడి ఇంటికి వచ్చిన ఇద్దరు కాలేజీ విద్యార్థులు బావిలో పడి చనిపోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల అమ్మనబోలు అనుబంధ గ్రామమైన అబీద్‌నగర్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అబీద్‌నగర్‌కు చెందిన యగమటి రాహుల్‌తో కలిసి హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో చదువుకుంటున్న 11 మంది స్నేహితులు సెలవులు ఉండడంతో బుధవారం అతడి ఊరుకు వచ్చారు. సరాదాగా రాహుల్ పొలం దగ్గరికి వెళ్లారు. ఉప్పల్‌కు చెందిన శ్రీచరణ్(17), నంగునూరి శశివరుణ్(18) పక్కనే చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయారు. అది గమనించిన మరో యువకుడు వారిని కాపాడే ప్రయత్నంలో నీట మునగబోగా, రాహుల్ వెళ్లి అతడిని కాపాడాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వినతి

వినతి పత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

చౌటుప్పల్, అక్టోబర్ 30 : ప్రభుత్వం తక్షణమే వరి, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, చీరిక సంజీవరెడ్డి, బండారు నర్సింహ, రాగీరు కిష్టయ్య, కొండె శ్రీశైలం, ఆకుల ధర్మయ్య, పోట్ట శ్రీనివాస్, రాఘవరెడ్డి, మోహన్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు రేషన్ డీలర్ల శుభాకాంక్షలు

భువనగిరి కలెక్టరేట్ : వీరారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రేషన్ డీలర్లు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 30 : అదనపు కలెక్టర్ వీరారెడ్డిని కార్యాలయంలో జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎలగల రాజయ్య, కందుల శంకర్, రమేశ్, సుర్వి వెంకటేశ్‌గౌడ్, ఉమాదర్శన్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

ఆలేరు టౌన్ : మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అదనపు రెవెన్యూ కలెక్టర్ జి. వీరారెడ్డిని కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

బీబీనగర్, అక్టోబర్ 30 : మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 'దివాళి విత్ మై భారత్ -2024' కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులతో కలిసి బుధవారం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండమడుగు మెట్టు వద్ద ట్రాఫిక్ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ కేశవ ఎన్ఎస్ఎస్ బృందానికి రూల్స్ గురించి తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పావని ఆధ్వర్యంలో వాలంటీర్లు బీబీనగర్ ఎయిమ్స్‌లో ఉన్న రోగులకు సేవలందించి, వారికందించే సేవల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా వాలంటీర్లు కాలేజీ చుట్టూ పరిసరాల్లో క్లీన్ డ్రైవ్ నిర్వహించారు.

కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలి : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి

వలిగొండ, అక్టోబర్ 30 : బునాదిగాని కాల్వ పనులను పూర్తిచేసి మండల కేంద్రంతో పాటు మోటకొండూర్, ఆత్మకూర్(ఎం), మోత్కూర్, అడ్డగూడూర్ మండలాల రైతులకు సాగు నీరందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన 5 మండలాల పార్టీ మండల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మారుపాక వెంకటేశం, బాలగోని సత్యనారాయణ, ఉప్పల ముత్యాలు, బోడ సుదర్శన్ పాల్గొన్నారు.

'ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి '

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 30 : నవంబర్ 4న నల్లగొండలో నిర్వహించే ఉమ్మడి జిల్లా మాదిగల ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బరామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఎర్రసాని గోపాల్, ఈర్లపల్లి మల్లయ్య, పాపయ్య, దేవేందర్, స్వామి, సతీశ్, నోముల పాల్గొన్నారు.

3న అమ్మ యాది ఫౌండేషన్ వార్షికోత్సవం

మోత్కూరు, అక్టోబర్ 30 : గుండాల మండంలోని బ్రహ్మణపల్లిలో అమ్మ యాది పెండం ఫౌండేషన్ 13వ వార్షికోత్సవ సభను నవంబర్ 3న నిర్వహించనున్నట్లు మోత్కూరు ప్రజా భారతి సాహితి, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దేవినేని అరవింద రాయుడు, గుమ్మిడెల్లి వెంకన్న తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ ప్రచార పత్రాలను వారు అవిష్కరించి మాట్లాడారు. ప్రజా భారతి ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, జయశ్రీ, రాంప్రసాద్, వెంకటాచారి, ఎస్ఎన్‌చారి, మనోహర్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సలుజా దవాఖానపై డీసీఏ దాడులు

పెద్ద ఎత్తున నార్కొటిక్, సైకోట్రోపిక్ డ్రగ్స్ సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా నార్కొటిక్ డ్రగ్స్, సైకొట్రోపిక్ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న దవాఖానతో పాటు ఓ ఇంటిపై డీసీఏ, అబ్కారీ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారిలో ఉన్నారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... మహారాష్ట్ర, నాగ్‌పూర్‌కు చెందిన నేహా భగవత్ నిబంధనలకు విరుద్ధంగా మార్ఫిన్ ఇంజక్షన్లు, ఫెంటనైల్ సిట్రేట్ ఇన్‌ఫెక్షన్స్, పాచ్చస్, పెంటజోసిన్ ఇంజక్షన్స్ వంటి డ్రగ్స్‌ను నాగ్‌పూర్‌కు చెందిన పియోనీర్ డ్రగ్ హౌస్ నిర్వాహకుడి వద్ద నుంచి కొనుగోలు చేసి నగరంలోని పలువురికి సరఫరా చేస్తుంది. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు, అబ్కారీ అధికారులతో కలిసి సికింద్రాబాద్, రెజిమెంటల్ బజార్‌లోని జీవీ సలుజా హాస్పిటల్‌పై దాడులు జరిపారు. ఈ దాడుల్లో నార్కొటిక్, సైకోట్రోపిక్ డ్రగ్స్ కలిగి ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఇంజక్షన్‌లు, మాత్రలు, తదితర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నేహా భగవత్ ఇంటిపై కూడా దాడులు జరిపి డగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న నేహా భగవత్, జీవీ సలుజా హాస్పిటల్ ఉద్యోగి గోపీనాథ్, థియేటర్ టెక్నీషియన్ సురేందర్ సింగ్, ఫార్మాసిస్ట్ బి.శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా దవాఖాన యజమాని రాజేందర్‌సింగ్ సలుజ, అతడి భార్య డా.అమృత సింగ్ సలుజ, పియోనీర్ డ్రగ్ హౌస్ యజమాని దినేశ్ పరారీలో ఉన్నారు.